క్లుప్తంగా

సెబ్ పోలీసుల తనిఖీలు

చిలమత్తూరు: మండలంలోని కర్ణాటక సరిహద్దుల్లో శుక్రవారం సెబ్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో కర్ణాటక ఎక్సైజ్ పోలీసులతో కలిసి మండలంలోని ఆదేపల్లి తండా సమీపంలోని లింక్ రోడ్లలో కాపు కాశారు. అయితే అక్రమ మద్యం తరలించే దుండగులు అటువైపు రాకుండా జాగ్రత్త పడినట్లు సమాచారం.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చిలమత్తూరు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్, డీటీ హనుమంతు, ఎస్‌ఐ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. మండలంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి

చిలమత్తూరు: పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆమె చిలమత్తూరు, చేనేపల్లి గ్రామాల్లో పర్యటించి, కార్యకర్తలను పరామర్శించారు. కార్యకర్తలు, తమను నమ్ముకున్న వారికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పురంలో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందన్నారు. ప్రజల్లో సీఎం జగన్‌పై చాలా నమ్మకం ఉందని, ఇచ్చిన మాట నిలబెట్టుకునే మనస్తత్వం ఉంది కాబట్టే ప్రజలు వైఎస్సార్ కుటుంబాన్ని ఆదరిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలన్నదే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కవిత, నాగమణి, టేకులోడు కవిత, సనమ్ హుస్నా పాల్గొన్నారు.

వలంటీర్‌పై కొడవలితో దాడి

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లిలో మల్బరీ తోటలోకి గేదె వెళ్లిందనే కారణంతో గ్రామానికి చెందిన శివరంగేగౌడు, మరొక వ్యక్తితో కలిసి గ్రామ వలంటీర్ కిశోర్ బాబుపై శుక్రవారం కొడవలితో దాడి చేశారు. పొలం వద్ద తీవ్ర గాయాలతో పడిపోయిన వలంటీర్‌ను మడకశిర ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్సల కోసం హిందూపురం తరలించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరాయప్ప, మైలారప్ప, జయరాజ్, జమ్మానిపల్లి మూర్తి, రామలింగప్ప, బుడ్డప్ప మాట్లాడుతూ.. వలంటీర్‌పై దాడి చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొరపాటున మల్బరీ తోటలోకి గేదె పోతే కొడవలితో దాడి చేయడాన్ని తప్పుపట్టారు.

అడవికి నిప్పు

పెనుకొండ: పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన దొడ్డికుంట ప్రాంతంలో ఉన్న అడవికి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది మంటలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే మధ్యలో భారీగా మంటలు చెలరేగడంతో నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు.

దోమలు ప్రబలకుండా చర్యలు

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలో దోమలు ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ప్రభాకర రావు తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డివిజనల్ మలేరియా అధికారి బత్తుల కోదండరామిరెడ్డితో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులను సందర్శించారు. దోమలు ప్రబలకుండా పలు వార్డుల్లోని మురుగు కాలువల్లో మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నజీర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ నూర్‌అలీఖాన్, కదిరేపల్లి, పీహెచ్‌సీల డాక్టర్లు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

లేపాక్షి: మండలంలోని శిరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శిరివరం దేవాలయ ట్రస్ట్ నిర్వాహకుడు రామచంద్రరావు, జేఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మి, విశ్రాంత సిండికేట్ బ్యాంక్ మేనేజర్ రామనారాయణ్ రూ.10 వేలు విలువ చేసే క్రీడా పరికరాలను అందజేశారు.

శివరాత్రికి వేళాయె..

- జాగరణ ఉత్సవాలకు సిద్ధమైన శివాలయాలు
- ప్రత్యేక అలంకరణలు, పూజలకు ఏర్పాట్లు



హిందూపురం: అలంకరణలో రాతి శివాలయం



చిలమత్తూరు: కొలువుదీరిన గిరిజాశంకరులు

హిందూపురం: శివరాత్రి పండుగను పురస్కరించుకుని హిందూపురం పట్టణం, పరిసరాల్లోని ముఖ్య శివాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేపట్టారు. పట్టణంలోని త్యాగరాజనగర్‌లోని నర్మదశ్వర రాతి శివాలయాన్ని ఘనంగా ముస్తాబు చేశారు. తెల్లవారుజామున అభిషేకాలు, ఉదయం పూజలు, దర్శనంతో పాటు మృతుంజయ హోమం చేసి సాయంత్రం శివపార్వల కల్యాణోత్సవం, 12 గంటలకు లింగోద్భవ వేళలో రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. బసన్నపల్లిలో వెలిసిన మహాశివుడి భారీ విగ్రహంతో పాటు ఆలయ ఆవరణంలోని వందలాది శివలింగాల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో..

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఆగమికులు సునిల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహశర్మ, శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళారతి కార్యక్రమాలు నిర్వహించారు.

మడకశిరరూరల్: పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి, బోగిరామేశ్వరస్వామి, శ్రీశంకరలింగేశ్వరస్వామి, స్వయంభువనేశ్వరి, రామలింగేశ్వరస్వామి పంచలింగాలు ఉన్నాయి. అదేవిధంగా శ్రీకోటవీధి వెంటకరమణస్వామి, షిరిడిసాయిబాబా, మెట్టబండ ఆంజినేయస్వామి, శ్రీకన్యకాపరమేశ్వరి, భక్తరపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి, నీలకంఠేశ్వరస్వామి, ప్రసన్న ఆంజినేయస్వామి, కొండపై వెలిసిన రామలింగేశ్వరస్వామి దేవాలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. రాత్రి జాగరణ చేయడానికి హరికథలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కెంచమ్మనహళ్ళి గ్రామంలో..

పావగడ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తాలూకాలోని కెంచమ్మనహళ్ళి గ్రామంలో శనివారం నిర్వహించే పాలేనహళ్ళి చిత్రలింగేశ్వర స్వామి జాగరణోత్సవాలు, మేలు దీపోత్సవానికి స్వామి వారికి ప్రత్యేక ప్రారంభ పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు చిక్కణ్ణ మాట్లాడుతూ.. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కామనహట్టి నుంచి వచ్చే దేవుడి ఉత్సవ మూర్తిని స్థానిక ఆలయంలో ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తామన్నారు.

కమనీయం.. గిరిజాశంకరుల కల్యాణం

చిలమత్తూరు: కొడికొండలో వెలసిన పంచనందీశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం గిరిజా శంకరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరులను కల్యాణ వేదికపై కొలువుదీర్చి మంగళ వాయిద్యాల నడుమ కళ్యాణాన్ని జరిపించారు. శనివారం మహాశివరాత్రి సందర్భంగా రుద్రాభిషేకం, అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు శంకరనారాయణ, బాలు స్వామి తెలిపారు.

25 వరకూ సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

అమరాపురం: హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఈనెల 25వ తేదీ వరకూ జరుగుతాయి, ఇందు కోసం ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, ఈఓ నాగేంద్రప్రసాద్‌రావు, ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. 20న అగ్నిగుండం, 21న సిడిమానోత్సవం, 22న చిన్న రథోత్సవం, 24న బ్రహ్మ రథోత్సవం నిర్వహిస్తామన్నారు. కోట వీధిలో వెలసిన చోళామాంబదేవి పెద్ద ఉత్సవాలను నిర్వహించాలని ఆలయ కమిటీ సభ్యులు గౌడలు నిర్ణయించారు. అమరాపురంలోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో శివమూర్తి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటామని నిర్వాహకురాలు పుష్పక్క తెలిపారు.

కామన దుర్గంలో ప్రత్యేక ఏర్పాట్లు..

పావగడ: తుమకూరు జిల్లా పావగడ తాలూకా నీలమ్మనహళ్ళి గ్రామం సమీపంలో ఉన్న కామన దుర్గంపై శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. కర్ణాటక నుంచే కాకుండా ఆంధ్ర భక్తులు సైతం కామిలి కొండకు అధిక సంఖ్యలో తరలివస్తారు. శనివారం ఉపవాసం ఉండి రాత్రి ఆలయంలో రామ భజనలు చేసి జాగహరణ చేస్తారు.

అమ్మజాన్ బాబాజాన్ దర్గాలో ప్రార్థనలు

హిందూపురం: కర్ణాటక రాష్ట్రం హోసన్ సమీపంలోని అమ్మజాన్ బాబాజాన్ దర్గాను శుక్రవారం ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు దర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన మరో 30 ఏళ్లు కొనసాగాలని కోరుకుంటూ దర్గాలో పూల చాదర్ సమర్పించారు. కార్యక్రమంలో హిందూపురం వైఎస్సార్‌సీపీ నాయకులు కట్లాబాషా, కౌన్సిలర్ ఆయూబ్, సాదిక్, చంద్‌బాషా, హుమయూన్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో నుంచి జారిపడి యువకుడికి గాయాలు

రొద్దం: మండల పరిధిలోని రాగిమేకులపల్లి గ్రామం వద్ద పెనుకొండ–పేరూరు రహదారిపై శుక్రవారం సాయంత్ర ఆర్టీసీ బస్సు ఎక్కుతూ ఆంజనేయులు అనే వ్యక్తి కాలుజారి కిందపడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన ఆంజనేయులును 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నాగస్వామి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై ఆర్టీసీ డ్రైవర్, ప్రయాణికులను విచారరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి..

మడకశిర(అగళి): అగళి మండలం కసాపురం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రొళ్ల మండలం బీజీ హళ్లి గ్రామానికి చెందిన నరసింహరాజు అనే యువకుడు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. తలకు బలమైన గాయం కావడంతో రొళ్ల ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం తుమకూరు ఆస్పత్రికి తరలించారు. నరసింహరాజు తన సొంత గ్రామం నుంచి అగళి వైపు వస్తూ ఓ కంపెనీ కారును ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు గృహసారథులకు శిక్షణ తరగతులు

రొద్దం: మండలంలోని నారనాగేపల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సచివాలయాల సమన్వయ కర్త ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరవుతారని వివరించారు. ఎం కొత్తపల్లి, ఆర్ లోచెర్ల, నారనాగేపల్లి గ్రామ సచివాలయాల పరిధిలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు హాజరు కావాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

సోమందేపల్లి: మండలంలోని చాలకూరు సమీపంలో శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. శీగుపల్లికు చెందిన నాగరాజు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో కర్ణాటక మద్యం తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడి నుంచి 334 మద్యం ప్యాకెట్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడిలో ఏఎస్‌ఐ మురళి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అమ్మవారుపల్లిలో కియా పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గుట్టూరు, మునిమడుగు, దుద్దేబండ, వీజీపాళ్యం, ఎర్రమంచి పంచాయతీల్లోని గృహసారథులు, సచివాలయ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం మార్చి 18 నుంచి వారం రోజుల పాటు జరగనుందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు మార్చి 18 నుంచి 26 లోపు వారికి కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. ఇందులో ఓ మహిళ సైతం ఉంటుందన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అన్న కరపత్రం ఇచ్చి మూడున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులు వివరించాలన్నారు. గత పాలనలో చంద్రబాబు ఇచ్చిన హామీలు, మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. నిన్ను నమ్మం బాబు అని కరపత్రంలో ఒకవైపు, మరోవైపు చెప్పాడంటే చేస్తాడంతే విషయాలన్నింటినీ వివరించాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే జగనన్న ముఖ్యమంత్రి కావాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు అంకితభావంతో పని చేయాలన్నారు. ఆయా పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు ఇతర ముఖ్య నాయకులు తగిన సహకారం అందించాలన్నారు. చంద్రబాబు జగనన్నపై చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల వైఎసార్ సీపి కన్వీనర్ నాగలూరుబాబు, జడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, ఎంపీపీ గీత, మాజీ ఎంపీటీసీ రామ్మోహన్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు శ్రీనివాసులు, మాజీ కన్వీనర్‌లు శ్రీకాంత్‌రెడ్డి, నీరగంటి వెంకటరాముడు, ముఖ్యనాయకులు శ్యాంనాయక్, కొండలరాయుడు, పొగాకురామచంద్ర, నారాయణస్వామి, నటేష్, సత్తి, సర్పంచ్‌లు నాగమూర్తి, అశ్వర్థప్ప తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను వివరించండి

ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం హామీలను విస్మరించిన చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని పెనుకొండ నియోజకవర్గ పరిశీలకుడు బాబురెడ్డి, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2014లో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు.. వాటిని అమలు చేయలేదన్నారు. అలాంటి మోసపూరిత వ్యక్తికి మళ్లీ ప్రజలు అధికారం చేతిలో పెడితే కష్టాలు తప్పవన్నారు. నేడు జగనన్న ప్రతి కుటుంబానికి అందిస్తున్న సంక్షేమ పథకాలు రద్దవుతాయన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, కౌన్సిలర్లు తయూబ్, రఘునాథరెడ్డి, సద్దాం, భాస్కర్‌నాయక్, రామాంజినేయులు, కో–ఆప్షన్ మెంబర్ వెంకటరామిరెడ్డి, ముహీబా, ముఖ్యనాయకులు రామ్మోహన్‌రెడ్డి, ఫరీద్, రామస్వామి, జయశంకరరెడ్డి, బోయబాబు, శ్రీరాములు, క్రిష్టప్ప, యాసిన్, మారుతి, శంకరరెడ్డి, నాయుడు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు.శుక్రవారం తన స్వగృహంలో నియోజకవర్గంలోని 5 మండలాలు, మున్సిపాలిటీకి చెందిన జేసీఎస్ కన్వీనర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేసీఎస్ కన్వీనర్లు పార్టీ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. ఇంటింటికీ వెళ్ళి ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఓటర్లను కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేసే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని కూడా తిప్పి కొట్టాలన్నారు. మరోసారి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్లు నాగేంద్ర,శ్రీనివాసరెడ్డి, శివకుమార్, రొళ్ల నాగేంద్ర, శివన్న, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల సమస్యతో మహిళ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్న అశ్వర్థమ్మ(50) శుక్రవారం మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఆమె మృతి చెందినట్లు బంధువులు ఆరోపించారు. లేపాక్షి మండలం బీచగానిపల్లికి చెందిన అశ్వర్థమ్మ ఒకటిన్నర సంవత్సరంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతుండేది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి స్థానిక ప్రభుత్వాస్పత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు పలు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శుక్రవారం ఉదయం ఆమె రక్తం కక్కుకుని మృతి చెందింది. దీనిపై ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్‌ను సంప్రదించగా.. అశ్వర్థమ్మ కోవిడ్ నుంచి కోలుకుని ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నారు. వైద్యులు ఆమె పరిస్థితిని గమనించి రెఫర్ చేస్తామని చెప్పారన్నారు. వారు ఇక్కడే చూపించుకుంటామని చెప్పి, అంగీకారం తెలుపుతూ సంతకం కూడా చేశారన్నారు. దురదృష్టవశాత్తూ ఆమె శుక్రవారం మృతి చెందిందన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

హిందూపురం టౌన్: స్థానిక అల్ ఇందాద్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు శుక్రవారం అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణంలోని మేళాపురం సమీపంలో రెండ్రోజుల క్రితం గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. అతడి ఆచూకీ కోసం పోలీసుల విచారణ చేపట్టినా వివరాలు లభ్యం కాలేదు. వన్‌టౌన్ జమేదార్ హరిప్రసాద్ విషయాన్ని అల్ ఇందాద్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు అమన్ దృష్టికి తీసుకెళ్లడంతో సేవామందిరం బ్రిడ్జి సమీపంలోని శ్మశాన వాటికలో అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేశారు.

చిన్నారి ఆపరేషన్‌కు ఆపన్న హస్తం



చిన్నారితో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: ఆపదలో ఉన్న ఓ చిన్నారి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందజేసి, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అండగా నిలిచారు. వివరాలు.. బీహార్ నుంచి వలస వచ్చి మేళాపురంలో మసీదు వద్ద మౌజన్‌గా సద్దాంహుసేన్ కుమార్తె రుఖియా ఫాతిమా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. శుక్రవారం పట్టణంలో కార్యక్రమాలు ముగించుకుని ఇంటికి చేరిన ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను సద్దాంహుసేన్ కలిశారు. 4 ఏళ్ల పాప రుఖియా ఫాతిమా హార్ట్‌లో హోల్ ఉండటంతో ఆపరేషన్ చేయించాలని వైద్యులు సూచించారన్నారు. ఆపరేషన్‌కు రూ.1.50 లక్షలు ఖర్చు అవుతుందని కన్నీరు పెట్టుకున్నాడు. చలించిన ఎమ్మెల్సీ అప్పటికప్పుడు అనుచరులతో మాట్లాడి మొత్తం 1.50 లక్షలు ఆపరేషన్ కోసం సమకూర్చారు. అంతేగాక బెంగళూరులోని జయదేవా ఆసుపత్రి నిర్వహకులతో ఫోన్‌లో మాట్లాడారు. త్వరగా ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేసి సదుపాయలు కల్పించాలని సూచించారు.

ఉత్సాహంగా రీజినల్ స్థాయి క్విజ్ పోటీలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం ఆర్డీటీ రీజినల్ కార్యాలయంలో శుక్రవారం రీజినల్ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీ మల్లికార్జున మాట్లాడుతూ.. విద్యార్థులు మేథోశక్తిని పెంచుకుని రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. మెదటి, రెండో స్థానాల్లో విజేతలుగా నిలిచిన మడకశిర, రొళ్ల మండలం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ నారాయణస్వామి పాల్గొన్నారు.

రొళ్ల: ఆర్డీటీ ఏరియా స్థాయిలో జరిగిన క్విజ్ పోటీల్లో మండలంలోని హులికుంట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న మేఘన తెలుగులో, గణితంలో కిరణ్‌కుమార్, పరిసరాల విజ్ఞానంలో ఉమాదేవి, జీకేలో వీణ రెండో స్థానం కైవసం చేసుకున్నట్లు ఏటీఎల్ సుబ్బారావు తెలిపారు.

లెదర్ పార్కులను ప్రారంభించేందుకు కృషి



ఎమ్మెల్యే తిప్పేస్వామికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మడకశిర: రాష్ట్రంలో ప్రారంభానికి నోచుకోని లెదర్ పార్కులను ప్రారంభించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. శుక్రవారం మడకశిరలో ఎమ్మెల్యే తిప్పేస్వామిని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు హనుమంతు కలిశారు. లెదర్ పార్కులను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా మడకశిరలో సెజ్‌కు సేకరించిన 1,600 ఎకరాల్లో లిడ్‌క్యాప్‌కు 500 ఎకరాలు కేటాయించి ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులతో మాట్లాడి లెదర్ పార్కులను వెంటనే ప్రారంభించి దళిత యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. మండలంలోని ఆర్ అనంతపురం వద్ద ఏర్పాటు చేసిన మినీ లెదర్ పార్కును కూడా ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

డిపో అభివృద్ధిపై సమావేశం

పెనుకొండ: స్థానిక ఆర్టీసీ డిపో డీఎం కార్యాలయంలో శుక్రవారం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ మధుసూధన రావు నేతృత్వంలో డిపో అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. డెవలప్‌మెంట్ ఆఫ్ బస్‌స్టేషన్స్ అండర్ పీపీపీ మోడల్‌పై చర్చ జరిగింది. బస్టాండ్‌లో కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం, కంట్రోల్ రూం ఏర్పాటు, విశ్రాంతి గదుల నిర్మాణం, ఆఫీస్ రూంల నిర్మాణంపై చర్చించారు. బస్ స్టేషన్లను పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేసి, 33 సంవత్సరాలు లీజుకు ఇచ్చేందుకు చర్చించారు. ఇందుకు లీజు ఆమోదయోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రవీంద్రబాబు, హంపన్న, రామాంజినేయులు పాల్గొన్నారు.

అంతర పంటల సాగు తప్పనిసరి

రొళ్ల: రబీలో వేరుశనగ పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా అంతర పంటగా అలసంద, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయశాఖ వీఏఏ నేత్ర రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కాకి రైతు భరోసా కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ పంటలను పరిశీలించారు. పలు గ్రామాల్లో వేరుశనగ పంటకు నల్లచీడ (పేనుబంక) సోకినట్లు గుర్తించారు. రైతులు ముఖ్యంగా పేనుబంక నివారణకు పంటసాగులో మెరసాళ్ల కింద ప్రత్యామ్నాయంగా అంతర పంటగా అలసంద, ఆముదం సాగు చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటకు ఆశించే నల్లచీడను సాధ్యమైయ్యేంత వరకు నివారించుకోవచ్చునన్నారు. పంటసాగులో సస్యరక్షణ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దిగుబడి పొందడానికి అవకాశం ఉందన్నారు. సాగులో ఏమైనా సందేహాలు ఉంటే వీఏఏలను సంప్రదించాలన్నారు.

పంచరత్నాలతో రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప

పావగడ: మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి రూపొందించిన పంచరత్నాల్లోని పథకాలతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని జేడీఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తిమ్మరాయప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో లాయర్లతో సమావేశం నిర్వహించారు. వచ్చే విధాన సభ ఎన్నికల్లో ఎవరి పొత్తు లేకుండా జేడీఎస్ సంపూర్ణ మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక విధాన సభ క్షేత్రంలో జేడీఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఓట్లేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో లాయర్లు నాగేంద్రప్ప, శివకుమార్, నరసింహప్ప, వెంకటేశ్, హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

రవీంద్రారెడ్డిని మంచి మెజారిటీతో గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వెన్నపూస శివారెడ్డి

హిందూపురం టౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, వెన్నపూస రవీంద్రారెడ్డి సోదరుడు వెన్నపూస శివారెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని బాలయేసు, బాలాజీ విద్యాసంస్థలతో పాటు పట్టణ సమీపంలోని ఎస్‌లైట్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను, అధ్యాపకులను కలిసి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోహేల్, అభి పాల్గొన్నారు.

పెనుకొండ: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఆయన సోదరుడు వెన్నపూస హరినాథరెడ్డి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులను అభ్యర్థించారు. శుక్రవారం మండలంలోని అమ్మవారుపల్లి, ఎమ్మెల్యే శంకరనారాయణ క్యాంప్ కార్యాలయంలో జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో హరినాథరెడ్డి పాల్గొన్నారు. మార్చిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే శంకరనారాయణ, పార్టీ పరిశీలకుడు బాబురెడ్డి మాట్లాడుతూ.. వెన్నపూస రవీంద్రారెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించడానికి పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.